క్లుప్తంగా

ఘనంగా అంబలం పూజ


పూజలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేట గ్రామం అయ్యప్ప స్వామి ఆలయంలో మాలధారణ భక్తులు పూజలు చేశారు. అంబలం ఏర్పాటు చేసి వినాయక, అయ్యప్ప, సుబ్రమణ్య స్వామి వార్ల చిత్రపటాలను ఉంచి పుష్పాలతో సుందరంగా అలంకరించారు. గురువారం రాత్రి పెద్ద ఎత్తున మెట్ల పూజను నిర్వహించారు. కర్పూరంతో ఓంకారాన్ని వెలిగించారు. భక్తులు స్వామియే శరణం అయ్యప్ప అంటూ అయ్యప్పను స్మరిస్తూ భక్తిప్రపత్తులతో స్వామి వారిని కొలిచారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్‌స్వామి మాట్లాడుతూ, అయ్యప్ప మహిమలను వివరించారు. అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీలు

నగరి: స్కూల్ గేమ్ ఫెడరేషన్ జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఏకాంబరకుప్పం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సుకన్య, నందకుమార్ ఎంపికయ్యారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు నంద్యాల టౌన్ కేఎస్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ అండర్‌-14 త్రోబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని సుకన్య, 9వ తరగతి విద్యార్థి నందకుమార్ ఉత్తమ ప్రతిభ చాటారు. ఉమ్మడి జిల్లా జట్టు బాలికల విభాగంలో రెండవ స్థానం, బాలుర విభాగంలో మూడవ స్థానం సాధించారు. న్యూఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నమశ్శివాయం, పీడీలు మణి, కార్తికేయన్, ఉపాధ్యాయులు అభినందించారు.

వంద మందికి అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో టీటీడీ ఉద్యోగి టి.సుజాత కుటుంబ సభ్యులు శుక్రవారం వంద మందికి అన్నదానం చేశారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం


పుత్తూరు: సాయం అందిస్తున్న కుమారస్వామి

పుత్తూరు: పుత్తూరు మండలం రామసముద్రం సచివాలయంలో శుక్రవారం తుపాన్ బాధిత కుటుంబాలకు గ్రామ సర్పంచ్ కుమారస్వామి ప్రభుత్వం అందజేసిన పరిహారాన్ని పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలకు చెందిన లబ్ధిదారులు 26 మందికి ఒక్కొక్కరికి రూ.2,500 వంతున అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ నేటి రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి విపత్తు సమయాల్లోనూ తక్షణం ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాజా, రవి, దినేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం మాధవి, వసంతకుమార్ దంపతుల కుమార్తె మోక్షిత పుట్టినరోజు సందర్భంగా మధ్యాహ్నం అన్నదానం చేశారు. వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, రాస్ కో–ఆర్డినేటర్ ప్రకాష్ పలువురు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి జగనన్నతోనే సాధ్యం


పుత్తూరు: సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: పేద ప్రజల అభ్యున్నతి కోసం జగనన్న రాష్ట్రానికి మరోమారు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వడమాలపేట సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బోర్డును ప్రారంభించారు. గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న రాష్ట్ర ముఖ్యమంత్రిగా సంతకం చేసిన క్షణం నుంచి రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల వారికి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అమ్మఒడి, వైఎస్సార్ పెన్షన్ కానుక, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేదోడు, వైఎస్సార్ బీమా, సున్నా వడ్డీ వంటి పలు సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఈ సంతోషం శాశ్వతం కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు మోసపూరిత వాగ్దానాలను గుప్పిస్తున్నారని ఆరోపించారు. గతంలో తాము చేసిన మంచిని చెప్పి ఓట్లు అడిగే స్థితిలో టీడీపీ లేదని, అందుకే అసత్య ప్రచారాలతో ప్రజల ముందుకు వస్తోందని విమర్శించారు. వీటిని వైఎస్సార్‌సీపీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఇందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు తమవంతు పాత్ర పోషించాలన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లల్లో అందిస్తున్న సీఎం జగనన్న, మంత్రి రోజమ్మను ప్రజలందరూ మరోమారు ఆశీర్వదించాలని కోరారు. జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ భరత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, నాయకులు ఉమాపతి, యాదవేంద్రరెడ్డి, సురేష్‌రాజు, లోకేశ్వర్‌రెడ్డి, ఉపేంద్ర, కరుణాకర్‌చౌదరి, కిరణ్‌కుమార్, సుధీర్‌రెడ్డి, చంద్రారెడ్డి, మదనమోహన్‌రెడ్డి, మునిబాబు, మునెమ్మ, నందయ్య, చైతన్య, రాజారెడ్డి, బాబుమేస్త్రీ, వేణు, తిమ్మయ్య పాల్గొన్నారు.


గంగాధర నెల్లూరు: ఇంటింటి ప్రచారంలో నాయకులు

జగన్నను మళ్లీ గెలిపించుకుందాం

గంగాధర నెల్లూరు: సంక్షేమ పథకాల సారథిని మళ్లీ గెలిపించుకుందామని సర్పంచ్ రామక్క గోవిందన్ పిలుపునిచ్చారు. మండలంలోని వింజం గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ సీఎం జగనన్న పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు నవరత్నాలను 99 శాతం నెరవేర్చారని అన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం సచివాలయంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండా ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామక్క గోవిందన్, ఉప సర్పంచ్ చంద్రా రెడ్డి, సీనియర్ నాయకులు భాను చంద్రా రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుధాకర్, ఈవోపీఆర్డీ రాఘవేంద్ర రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ వెంకటేష్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం


మాట్లాడుతున్న ఇందిరా ప్రియదర్శిని

నగరి: బాలికలకు విపత్కర పరిస్థితిల్లో ఆత్మరక్షణకు కరాటే లాంటి విద్య ఉపయోగపడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మహిళా సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆత్మరక్షణ అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాలికలు ఆత్మరక్షణకు తీసుకోవాల్సిన అంశాలను కరాటే మాస్టర్ గోపి డెమో నిర్వహించి శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. విజయాలు సాధించాలంటే ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని తెలిపారు. కరాటే లాంటి విద్యలు నేర్చుకోవడం వల్ల ఆకతాయిలకు బుద్ధిచెప్పవచ్చన్నారు. మహిళా సాధికారత విభాగం అధ్యక్షురాలు డాక్టర్ ఎ.ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ అఘాయిత్యాలను ఎదుర్కోనేందుకు బాలికలు సిద్ధంగా ఉండాలని, ఇందుకు ఆత్మరక్షణ విద్యలు అవసరమని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ ఎం.అరుణకుమారి, డాక్టర్ సుహాసిని, ప్రేమ్‌కుమార్ (పీడీ), విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం

కార్వేటినగరం: మండలంలోని కౌమారదశ విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన ఎంతో అవసరమని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో రెండు రోజుల పాటు శుక్రవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమం ముగించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 136 పాఠశాలలకు చెందిన సైన్సు ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వడమే కాకుండా ఎయిడ్స్‌పై నియంత్రణకు ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా ఈ నెల 19న ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైట్ ఛాత్రోపాధ్యాయులు, డైట్ అధ్యాపకులు, చిత్తూరు ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శ్రీరంగరాజపురం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి బాలసుబ్రమణ్యంరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని ఆరోగ్య, ఆశ సిబ్బందితో మాట్లాడుతూ తుపాను ప్రభావంతో జ్వరాలు, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలకు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే విధంగా వారికి ఆశ సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో అనారోగ్యానికి గురైన వారిని గుర్తించి ప్రాథమిక వైద్యశాలకు తీసుకురావాలన్నారు. దీనికి నర్స్ యమున, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి ఘన సన్మానం


బదిలీ అయిన వైద్యాధికారులను సన్మానిస్తున్న సిబ్బంది

కార్వేటినగరం: కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వెళ్లి వైద్య సిబ్బందిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. వైద్యాధికారులు డాక్టర్ భువనేశ్వరి, హేమశ్రీ మాట్లాడుతూ కత్తెరపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన డాక్టర్ గోపినాథ్, డాక్టర్ యూసఫ్, హెడ్ నర్స్ సునీత, కంప్యూటర్ ఆపరేటర్ కరుణశ్రీని శాలువలు కప్పి గజమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం బదిలీపై వెళ్లిన వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ వైద్యరంగంలో విధులు సక్రమంగా నిర్వహించినప్పుడే ప్రజల్లో గుర్తింపు లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాజేశ్వరి, సీహెచ్ఎన్ గౌరి, పర్యవేక్షకులు త్యాగరాజు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో ఉపాధిని పెంచుకోవాలి


మాట్లాడుతున్న యశ్వంత్

వెదురుకుప్పం: ఇంటర్న్‌షిప్ ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సత్య ఇన్ఫోటెక్ సంస్థ తిరుపతి వారి ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నైపుణ్యాలతో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం సంస్థ సీనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ యశ్వంత్, హేమంత్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో ఇంటర్న్‌షిప్‌కు ప్రాధాన్యత అధికంగా ఉంటుందని చెప్పారు. ఇంటర్న్‌షిప్ ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలను ఎలా మెరుగుపరచుకోవాలనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాకరరావు, ఓజేటీ ప్లేస్‌మెంట్ కో–ఆర్డినేటర్ నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీరామనామ సంకీర్తన శోభా యాత్రలో సర్పంచ్ సుబ్రమణ్యం, భక్తులు

హిందూ ధార్మిక సమ్మేళనం

గంగాధర నెల్లూరు: ప్రజలలో హిందూ ధార్మికతపై సామాజిక చైతన్యం ఉండాలని జీడీ నెల్లూరు గ్రామ సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం అన్నారు. మండల కేంద్రంలోని అల్లియల్లమ్మ దేవస్థానం ఆవరణలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హిందూ ధార్మికత సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఉదయం భజన బృందాల ప్రదర్శనతో ప్రారంభం కాగా, అనంతరం స్వామీజీల ప్రవచనం సాగింది. గ్రామంలోని వీధుల్లో శ్రీరామ నామస్మరణతో సంఘం సభ్యుల, గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులచే భారీ శోభాయాత్ర నిర్వహించారు. నిర్వాహకులతో దాదాపు 1000 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం, సమరసత సంఘం కార్యనిర్వాహకులు జయరామయ్య, చిన్నస్వామి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, చెంగల్ రెడ్డి, ధర్మ ప్రసారక్ సుబ్రమణ్యం, స్థానిక నాయకులు వీయం నారాయణ మూర్తి,భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శుక్రవారం మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్.ఐ దస్తగిరి కథనం మేరకు కార్వేటినగరం మండపం వీధికి చెందిన వెంకటేష్ కుమారుడు సుబ్రమణ్యం(52) గురువారం ద్విచక్రవాహనం ఢీ కొని తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయన్ను చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్.ఐ పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యుల పిర్యాధు మేరకు కేసును మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేయాలి


మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

పాలసముద్రం: మండల పరిధిలో ఉపాధిహామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యతగా చేయించాల్సిన బాధ్యత ఉపాధిహామీ సిబ్బందిపై ఉందని డ్వామా పీడీ గంగాభవానీ తెలిపారు. మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో శుక్రవారం జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో ఆమె మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజులు పనులు పూర్తి చేసుకోవాలన్నారు. కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ మార్గేట్‌కి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఎంటీఏ మునిరత్నం, ఎఫ్ఏ లోకేష్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం


విరూపాక్షమ్మకు మొక్కులు చెల్లిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్వేటినగరం: మండలంలోని వడ్డిగుడిసెలు గ్రామంలో వెలసిన శ్రీ విరూపాక్షమ్మ ఆలయ కుంభాభిషేకం శుక్రవారం వైభవంగా సాగింది. ఆలయంలో వేద పండుతులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ శిఖరంలో ఏర్పాటు చేసిన మహా కుంభ కలశాన్ని పవిత్ర జలాలతో వేద మంత్రాల నడుమ అభిషేకించారు. ఈ క్రమంలో భాగంగా అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్ అమ్మవారికు సారె సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అమ్ములు, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, బీసీసెల్ అధ్యక్షుడు నీలా పండరీనాథ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు దాము, ఎంపీటీసీ సుబ్రమణ్యంరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చేయూత


కార్యక్రమంలో పాల్గొన్న అపోలో పరిశ్రమ ప్రతినిధులు

- అపోలో పరిశ్రమ ప్రతినిధులు
- చిన్న పాండూరులో రూ. 62.24లక్షలతో
- 158 మరుగుదొడ్ల నిర్మాణం

వరదయ్యపాళెం: తమ పరిశ్రమ పరిధిలోని గ్రామాల్లో సీసీఆర్ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అపోలో పరిశ్రమ యూనిట్ హెడ్ ఆనంద్ సత్యమూర్తి వెల్లడించారు. మండలంలోని చిన్న పాండూరు పంచాయతీలో సీసీఎస్ నిధులు రూ.62.24లక్షలతో 158 మరుగుదొడ్లను నిర్మించారు. శుక్రవారం మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా దృక్పథంతో పేద ప్రజలకు చేయూతనిచ్చిన అపోలో పరిశ్రమ యాజమాన్యానికి స్థానిక సర్పంచ్ శ్యామల ప్రభుత్వం ద్వారా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అనంతరం పాదిరికుప్పం అరుంధతివాడలో నిర్మించిన మరుగుదొడ్లను ప్రతినిధులు లాంఛనంగా ప్రారంభించారు. చిన్న పాండూరు ప్రాథమిక పాఠశాలకు అదనపు తరగతి గది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ల్యాండ్ స్కేపింగ్ ద్వారా పార్క్ అభివృద్ధి చేయాలని స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు వారికి విన్నవించారు. ఈ సమస్యలను పరిశ్రమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్‌ఆర్ హెడ్ రాజామోహన్, ముత్తురామన్, లైజనింగ్ ఆఫీసర్ సాయిబాబా, సీఎస్ఆర్ ఇన్‌చార్జ్ లీఫన్, ఎంపీటీసీ సభ్యురాలు భువనేశ్వరి, ఉపసర్పంచ్ మహేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ వినితాశ్రీ

పాలసముద్రం: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను కచ్చితంగా నడిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీడీపీఓ వినితాశ్రీ తెలిపారు. మండల పరిధిలోని వెంగళరాజుకుప్పం, రంగాపురం అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సిబ్బంది బాధ్యతగా పంపిణీ చేయాలన్నారు. అనంతరం రంగాపురంలో గర్భిణులకు ఇస్తున్న పాలు, గుడ్ల రికార్డులను పరిశీలించారు.

విద్యుత్‌ను పొదుపు చేద్దాం


ర్యాలీగా వెళ్తున్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: భవిష్యత్ తరాల అవసరాలకు అందరూ విద్యుత్‌ను పొదుపు చేద్దామని ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకొని స్థానికంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఇంధనాన్ని వృథా చేయవద్దు– మన అభివృద్ధిని మనమే అడ్డుకోవద్దు, విద్యుత్ పొదుపుతో జగతికి మేలు, ఇంటింటా కరెంటు పొదుపు ఊరుకు వెలుగు, రోజుకు ఒక యూనిట్ పొదుపు చేయాలని ప్లకార్డులను ప్రదర్శించారు. సంప్రదాయేతర ఇంధన వనరుల మీద ఆధారపడటం దశలవారీగా అలవాటు చేసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఈ–వాహనాల వాడకం పెరుగుతుందని అప్పుడు ప్రతి ఒక పనికీ విద్యుత్ తప్పనిసరి అవసరమవుతుందన్నారు. కార్యక్రమంలో డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఏఈలు రాజేంద్రబాబు, బాలచంద్ర, కేశవులు, మహమ్మద్, కేశవచంద్ర, లోకేష్, నీరజ, మాధురి, ఉద్యోగ సంఘాల నాయకులు యజ్ఞేశ్వరరావు, గోవింద రాజులు, విద్యాసాగర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

18న పెన్షనర్ల దినోత్సవం

నగరి: పట్టణంలోని పెన్షనర్ల భవనంలో ఈనెల 18వ తేదీన అఖిల భారత పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జయచంద్రుడు, ఓ.బాలసుబ్రమణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున పదవీ విరమణ చేసి 15 సంవత్సరాలు పూర్తయిన సీనియర్ పెన్షనర్లను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

15 లీటర్ల సారా పట్టివేత



చిత్తూరు అర్బన్: యాదమరి మండలంలో సారా తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం ఎస్ఈబీ అధికారులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు, దాడులు నిర్వహించగా గొంది వాండ్లపూరు సమీపంలో హరిబాబు(34) నుంచి ద్విచక్రవాహనంతోపాటు 15 లీటర్ల సారాను పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తిని అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ట్రైనీ ఏఈఎస్ శ్రీరాం, ఎస్ఐ మోహన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో నీతి ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న ఏజీఎం పణికుమార్

చిత్తూరు కలెక్టరేట్: అన్నమయ్య జిల్లా మదనపల్లిలో నిర్వహించిన 67 వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ హాకీ క్రీడాపోటీల్లో నారాయణ పాఠశాల విద్యార్థిని నీతి ప్రతిభ చాటింది. అండర్ 14 హాకీ పోటీల్లో ప్రతిభ చాటిన ఆ విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యింది. ఆ విద్యార్థినిని శుక్ర వారం జిల్లా కేంద్రంలోని నారాయణ కళాశాలలో ఏజీఎం అవధానం పణికుమార్ అభినందించారు. ఏడీ జ్యోతీశ్వర్, పీఈటీ సుజాత పాల్గొన్నారు.

హిందువులందరికీ అయోధ్య అక్షింతలు



బంగారుపాళెం చేరిన అక్షింతలు, అక్షింతలను గ్రామాలకు తీసుకెళుతున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని గ్రామాల్లో ప్రతి హిందూ కుటుంబానికి అయోధ్య రాముడి అక్షింతలు అందించాలని బ్రహ్మనందాశ్రమ నిర్వాహకుడు కేశవానంద స్వామి అన్నారు. మండలంలోని మాధవనగర్ బ్రహ్మనందాశ్రమంలో శుక్రవారం శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముని పూజిత పవిత్ర అక్షింతలు అందజేశారు. అక్కడి నుంచి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు అందజేశారు. కేశవానంద స్వామి మాట్లాడుతూ, 2024 జనవరి 22న అయోధ్యలో శ్రీరాముని ఆలయ ప్రారంభోత్సవం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జనవరి 1 నుంచి 15వ తేదీ లోపు గ్రామాల్లోని ప్రతి హిందూ బంధువు ఇంటికి అయోధ్య అక్షింతలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహక కమిటీ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్‌లో యాదమరి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, క్రీడా దుస్తులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

యాదమరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చిత్తూరు జిల్లా తరఫున ఫెన్సింగ్ క్రీడల్లో యాదమరి ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ క్రీడలో పాల్గొన్నారు. 9వ తరగతి విద్యార్థినులు ఫాతిమా, పిరదౌస్, మోనిషా, యుగ భారతి, బాలుడు కార్తిక్, 8వ తరగతికి చెందిన దీక్షిత పాల్గొన్నారు. వీరిలో యుగభారతి, దీక్షిత వెండి పతకాలు సాధించారు. వీరు ఈ నెల 14 నుంచి 17 వరకు జరుగుతున్న ఎస్‌జీఎఫ్ ఫెన్సింగ్ పోటీల్లో రాష్ట్రం తరఫున ఆడనున్నట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ, పీడీ రవి, ఉపాధ్యాయులు సన్మానించారు. క్రీడాకారులకు ఇంగ్లీష్ ఉపాధ్యాయునులు త్రివేణి, సుగుణ రూ.15 వేలు విలువ చేసే ఎలక్ట్రానిక్ జాకెట్స్ విరాళంగా అందించారు.